పనులు ప్రారంభం

- సాగర్ వద్ద 20 ఎకరాలు కేటాయింపు
- 160 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి ప్లాంట్
- ఇన్‌టేక్ వెల్ నిర్మాణానికి సాగర్‌లో బాత్‌మెట్రిక్ సర్వే



మాచర్ల నియోజవర్గంలోని లచ్చమ్మబావి తండాలో చేపట్టిన ఓవర్ ట్యాంక్ పనులు

పట్టాలెక్కిన వాటర్‌గ్రిడ్ పథకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకం పనులు ప్రారంభమయ్యాయి. రూ.1,200 కోట్ల



ఇన్‌టేక్ వెల్ నిర్మాణానికి సాగర్‌లో సర్వే

వ్యయంతో తొలి విడత పనులు చేపట్టారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం జరుగుతుంది. గురజాల నియోజకవర్గంలో పనులు ప్రారంభించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లు వాటర్ గ్రిడ్ అటకెక్కగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించింది. జల్‌జీవన్ మిషన్‌ను 2028 వరకు పొడిగించడంతో పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఫ్లోరైడ్ బారి నుంచి రక్షణలో భాగంగా బోర్లు, బావుల నీటి వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి కృష్ణా జలాలను ప్రతి ఇంటికి సరఫరా చేయడమే వాటర్‌గ్రిడ్ లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. పథకం అమలుకు సాగర్ నుంచి ఏటా 1.83 టీఎంసీల నీటిని తీసుకుంటారు. ఇందుకు సంబంధించిన అనుమతులను కేఆర్ఎంబీని కోరారు. ప్రతి రోజూ వాటర్‌గ్రిడ్ ద్వారా గ్రామాలను నీటిని సరఫరా చేయాలంటే 56.7 కూసెక్కుల నీరు అవసరం అని అంచనా వేశారు. సాగర్ నుంచి నీటిని తీసుకుని శుద్ధి చేసి పైపులైన్ ద్వారా గ్రామాలకు చేయనున్నారు. రెండు దశల్లో నిర్మించే వాటర్ గ్రిడ్‌కు అవసరం మేర ఒకేసారి పైపులైన్‌ను నిర్మించనున్నారు.

తొలివిడతలో..

ఈ పథకాన్ని తొలివిడతలో 10 మండలాల్లోని 325 గ్రామాలకు అమలు చేస్తారు. మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల, దుర్గి, కారంపూడి, గురజాల, మాచవరం, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ మండలాల పరిధిలోని 325 గ్రామాల్లోని ప్రజలకు వాటర్‌గ్రిడ్ ఫలాలు అందనున్నాయి.

ఆంధ్రజ్యోతి కథనంతో స్థలం కేటాయింపు

వాటర్‌గ్రిడ్‌కు భూమి కావలెను.. అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఇటీవల వెలువడిన కథనంపై రెవెన్యూ శాఖ స్పందించింది. వెనువెంటనే సాగర్ హిల్‌కాలనీలో సాగర్ మాత విగ్రహం ప్రాంతంలో 20 ఎకరాలు కేటాయించింది. ఇక్కడ 160 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మించనున్నారు. ప్లాంట్‌కు సాగర్ జలాశయం నుంచి నీటిని తీసుకుంటారు. ఇన్‌టేక్ వెల్‌ను (మిగతా 7వ పేజీలో)



నిడుబ్రోలు - అప్పికట్ల రైల్వే సెక్షన్‌లో నూతనంగా నిర్మించిన డైవర్షన్ మార్గంలో ప్రయాణిస్తున్న రైలు

సూపర్ ఫాస్ట్‌గా రైళ్లు

- 140 కిలోమీటర్ల వేగంతో రాకపోకలు
- నిరోధకాలకు చెక్‌తో వేగవంతంగా ప్రయాణం
- నిడుబ్రోలు-అప్పికట్ల మార్గంలో టెస్టురన్ విజయవంతం

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇక రైళ్లు సూపర్‌ఫాస్ట్‌గా రాకపోకలు సాగించనున్నాయి. నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో వేగ నిరోధకాలతో అటు విజయవాడ, ఇటు గుంటూరు డివిజన్ల నుంచి వచ్చే పలు రైళ్ల సమయ పాలన అదుపుతప్పుతూ వస్తోంది. ఇక్కడ 10 కిలోమీటర్ల పొడవునా నేల స్వభా వం సరిగా లేకపోవడంతో తరచుగా రైళ్లు పట్టాలు తప్పడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో రైళ్లను దాదాపుగా 32 కిలోమీటర్ల పొడవునా 75 నుంచి 90 కిలోమీటర్ల వేగానికి మించి నడపకుండా చూస్తున్నారు. దీని వల్ల ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు, వందేభారత్ లాంటి ప్రీమియం రైళ్లు కూడా ఈ సెక్షన్‌లో నెమ్మదిగా ప్రయాణిస్తున్నాయి. సమయపాలన నష్టపోవాల్సి వస్తున్నది. హౌరా - చెన్నై రైలుమార్గంలో దశాబ్దాల తరబడి రైళ్ల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో శాశ్వత డైవర్షన్ పనులు పూర్తి అయ్యాయి. పదేళ్ల క్రితమే ఇక్కడి వాగుపై కొత్త వంతెన నిర్మించినప్పటికీ రైలుమార్గం డైవర్షన్ చేపట్టలేదు. ఎట్టకేలకు మూడు స్ట్రెచ్‌లలో ఆరు కట్ అండ్ కనెక్షన్లు చేశారు. పూర్తి అయిన శాశ్వత డైవర్షన్ సెక్షన్‌లో కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ 140 కిలోమీటర్ల వేగంతో టెస్టురన్ నిర్వహించింది. ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకపోవడంతో క్లియరెన్స్ జారీ చేసింది. దీంతో కొద్ది రోజుల్లోనే ఈ సెక్షన్‌లో ఎలాంటి వేగ నిరోధకాలు లేకుండానే రైళ్లను గరిష్ఠ వేగంతో నడపొచ్చని రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల వేగం పెరిగి నిర్ణీత సమయానికి రైళ్లు గమ్యస్థానాలకు చేరుకుంటాయని రైల్వే అధికారులు తెలిపారు. అలానే ఇతర డివిజన్లు, జోన్ల నుంచి రైళ్లను ఆలస్యంగా అందిస్తున్నారన్న ఫిర్యాదులకు కూడా ఫుల్‌స్టాప్ పడుతుంది.

ఎంత ప్రవాహం వచ్చినా తట్టుకునేలా..

నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో నేల స్వభావం పటిష్ఠంగా లేని కారణంగా రైలు మార్గం కోసం నిర్మించిన బండ్ ఒరిగిపోతున్నది. అంతేకాకుండా పాతవంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో 2014-19 మధ్య అప్పటి జలవనరుల శాఖ నూతన బ్రిడ్జిని నిర్మించింది. వాగులో ఎంత వరద ప్రవాహం వచ్చినా తట్టుకునేలా డిజైన్ చేశారు. వర్షాకాలంలోనూ ఇబ్బంది లేకుండా డైవర్షన్ పనులను పూర్తి చేశారు.

కీలకమైన మార్గం..

ఎప్పుడో బ్రిటీష్ కాలంలో కోస్తా తీరం పొడవునా హౌరా-చెన్నై రైలుమార్గాన్ని నిర్మించారు. దేశంలోని వివిధ రైలు మార్గాల్లో ఇదొక కీలకమైనది. ఉత్తర భారతదేశం నుంచి వచ్చే రైళ్లు కూడా విజయవాడ నుంచి హౌరా-చెన్నై రైలుమార్గంలో ప్రయాణించాల్సిందే. ఈ కారణంగా నిత్యం వందలాది సంఖ్యలో పాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు రైళ్లతో పాటు సరుకు రవాణాకు కూడా ఇదొక ముఖ్యమైన సెక్షన్. దీంతో గూడ్స్ రైళ్లు కూడా ప్రయాణిస్తుంటాయి. ఇంతటి కీలకమైన ఈ రైలుమార్గంలో నిడు బ్రోలు - అప్పికట్ల సెక్షన్ దశాబ్దాల తరబడి ఇబ్బందికరంగా పరిణమించింది.



పిడుగురాళ్ల సమీపంలో వేసిన లేఅవుట్‌లో సిమెంట్ రోడ్డు

ప్లాట్లు.. పాట్లు

- అనుమతులు.. రోడ్లు లేవు
- రుణాలకు బ్యాంకర్లు నిరాకరణ
- బోరున విలపిస్తున్న కొనుగోలుదారులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్లాట్లు కొనుగోలు చేసి ఇల్లు కట్టుకోవాలని అందరి కల. ఇదే అవకాశంగా రియల్టర్లు రెచ్చిపోతున్నారు. అనధికారికంగా లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పి ప్లాట్లను అంటగడుతున్నారు. తీరా రుణాలు ఇవ్వకపోవడంతో పాటు.. అక్కడ ఇంటి నిర్మాణానికి అనుమతులు రాకపోవడంతో కొనుగోలుదారులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. లేఅవుట్‌కు మున్సిపల్ అప్రూవల్ లేదని, అప్రూవల్, లింక్ డాక్యుమెంట్లు అన్నీ ఉంటేనే రుణాలు మంజూరు చేస్తామనే బ్యాంకర్ల సమాధానాలతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, జానపాడు, వీరాపురం, కామేపల్లి, కొండమోడు, దాచేపల్లి, గురజాల ప్రాంతాలలో ప్రధాన రహదారికి ఇరువైపులా వెలిసిన లే అవుట్లకు ల్యాండ్ కన్వర్షన్ తప్ప మరే ఇతర అనుమతులు లేవు. లేఅవుట్‌లో పదిశాతం కమ్యూనిటీ స్థలంగా వదలాలి, 40 అడుగుల రోడ్లు ఉండాలి. కానీ ఇవేవీ లేకుండా ప్లాట్లను విక్రయించారు. పిడుగురాళ్ల పురపాలక సంఘం పరిధి లో 59, దాచేపల్లి, గురజాల, తుమ్మలచెరువు, బ్రాహ్మణపల్లి, కామేపల్లి పంచా యతీల పరిధిలోనే సుమారు 100కి పైగా అనధికార లేఅవుట్లను ఇటీవల అధికా రులు గుర్తించి నోటీసులు జారీ చేశారు. అయితే వారిపై చర్యలు తీసుకోవడంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తు న్నారు. అనుమతులు లేకుండా గతంలో వేసిన లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇటీవల అనుమతించింది. అయితే రియల్టర్లు పట్టించుకోవడంలేదు. ప్లాట్లు అమ్మేశాం మాకేం సంబంధం లేదంటూ చేతులెత్తేయడంతో కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు.



పంట పొలాలను చదును చేసి దృశ్యం

భూభాగోతంపై నివేదిక

తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశాలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో వైసీపీ హయాంలో జరిగిన భూభాగోతాలపై నివేదికకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతు న్నారు. ఇప్పటికే ప్రాథమికంగా ఓ నివేదిక తయారు చేశారు. అయితే పూర్తి వివరాలతో నివేదికను తన ముందుంచాలని కలెక్టర్ కృతికాశుక్లా తహసీల్దార్లను ఆదేశించారు. దీంతో ఎక్కడెక్కడ ప్రభుత్వ, పట్టా భూములను వైసీపీ నేతలు, అనుయాయులు అడ్డ దారిలో తమ పేర్లు నమోదు చేసుకున్నారో తేల్చే పనిలో అధికారులు నిమగ్నమ య్యారు. గత నెలలోనే భూమాఫియా అక్రమాలకు సంబంధించిన వివరాలను గత కలెక్టర్ అరుణ్‌బాబుకు అధికారులు అందజేశారు. ఆ నివేదికపై అప్పటి కలెక్టర్ అరుణ్ బాబు కొంతమేర సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ కృతికాశుక్లా బుధ, గురువారాల్లో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు తయారు చేసిన భూభాగోతం చిట్టాను పరిశీలించిన కలెక్టర్ పిడుగురాళ్ల మినహా మిగిలిన మండలాల్లో రెవెన్యూ అధికారులు తయారు చేసిన నివేదిక సరిగా లేదని గుర్తించారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక, సర్వే నెంబర్ల వారీగా ఎంత మేర ఆక్రమణ జరిగిందో.. సంబంధం లేని వ్యక్తుల పేర్లు నమోదైన వారి వివరాలను కూడా పొందుపరిచి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ఆ మూడు మండలాల రెవెన్యూ అధికారులు శుక్రవారం కూడా కలెక్టర్ కార్యాలయంలోనే కూర్చొని జాబితా తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

భారీ వర్షం.. ఉధృతంగా వాగులు

- ఎక్కడికక్కడ స్తంభించిన రాకపోకలు
- రోడ్లు, లోతట్లు ప్రాంతాలు జలమయం



ఉధృతంగా ప్రవహిస్తున్న చంద్రవంక వాగు

గురజాలటౌన్, రెంటచింతల, మాచర్ల రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రాంతాల్లో గురువారం అర్ధరాత్రి ఓ మోస్తరు నుంచి భారీగా వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో శుక్రవారం ఉదయం నుంచి ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. వాగుల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారు. జిల్లాలోని పలు పట్టణ ప్రాంతాలు కూడా నీట మునిగిపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెంటచింతలలో 54.2 మి.మి వర్షపాతం నమోదైనట్లు జంగమహేశ్వరపురం వాతావరణ అధికారులు పేర్కొన్నారు. గురజాలలోని మండల పరిషత్ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయాల చుట్టూ భారీగా వర్షం నీరు చేరింది. పట్టణంలోని లక్ష్మీ టాకీస్ సెంటర్లోని మాచర్ల - గుంటూరు ప్రధాన రహదారిపై భారీగా వర్షపునీరు చేరింది. మాడుగుల సమీపంలోని ఎద్దుల వాగు ఉధృతంగా ప్రహహించడంతో మాడుగుల నుంచి గురజాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వెల్దుర్తి మండలంలో పట్లవీడు, రచ్చమల పాడు వాగులు పొంగడంతో రాకపోకలు స్తంభించాయి. ఉప్పలపాడు బొత్తలవాగు, ఎర్రవాగు, వెల్దుర్తి బండల వాగు, మండాది కానాగు ఉధృతంగా ప్రవహించాయి. పట్లవీడు చెరువుకు భారీగా వర్షపునీరు చేరడంతో అలుగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రెంటచింతల మండలంలో కొత్తపాలువాయి, పాత పాలువాయి గ్రామాల మధ్య పిల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సమీపంలోని పంట పొలాలన్నీ నీట మునిగాయి. గోలివాగు, పిల్లి వాగు మహోగ్రరూపం దాల్చాయి. తహసీల్దారు మేరీ కనకం ఆయా గ్రామాల వీఆర్వోలతో ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్షిస్తున్నారు. మాచర్లలోని చంద్రవంక నది పొంగి పొర్లింది. దీంతో మండలంలోని జమ్మలమడక గ్రామానికి రాకపోకలు నిలిపివేశారు.



● ఉధృతంగా ప్రవహిస్తున్న పట్లవీడు వాగు

జీఎస్టీ సంస్కరణలతో మేలు

- దీపావళి వరకు ప్రచార కార్యక్రమాలు
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ కృతికాశుక్లా

నరసరావుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో కొనుగోలుదారులకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. జీఎస్టీ అమలు, అవగాహన కార్యక్రమాలపై కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన జీఎస్టీతో తగ్గిన వస్తువుల ధరలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ పేరుతో దీపావళి వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల, మున్సిపాలిటీ, గ్రామ, వార్డు స్థాయిల్లో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు రూపొందించాలన్నారు. జీఎస్టీ హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఆయా శాఖలకు సంబంధించి ఏఏ వస్తువులపై ధరలు తగ్గాయో వివరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హౌస్ హోల్డ్ సేవింగ్స్‌కు సంబంధించి సచివాలయాల వద్ద 25 నుంచి 29 వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి జీఎస్టీ సంస్కరణలతో వచ్చే మేళ్లపై వివరించాలన్నారు. వ్యవసాయం, ఇతర వృత్తులకు సంబంధించి రైతు సేవా కేంద్రాలు, జిల్లా, మండల నియోజకవర్గ కేంద్రాల వద్ద 30 నుంచి వచ్చే నెల 6 వరకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాక్టర్ ర్యాలీలు, వ్యవసాయ పరికరాల ప్రదర్శనలు, మేళాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలన్నారు. మానవ వనరుల అభివృద్ధి, సాంకేతికత డిజిటల్ సాధికారత రంగాలలో జరిగే మేలును విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో వచ్చే నెల 7 నుంచి 13 వరకు ఎస్సే రైటింగ్, పెయింటింగ్ కాంపిటీషన్లు, ఉపన్యాస పోటీలతో పాటు ఎగ్జిబిషన్లు, సెమినార్లు నిర్వహించాలన్నారు. అభివృద్ధి సంపద సృష్టి రంగాల్లో జీఎస్టీ సంస్కరణల కారణంగా కలిగే మేలును 14 నుంచి 18 వరకు వివరించాలన్నారు. జిల్లాస్థాయిలో షాపింగ్ వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాల న్నారు. వచ్చే నెల 19కి ఒక రోజు ముందుగా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ, సామూహిక దీపావళి వేడుకలు జిల్లాస్థాయిలో నిర్వహించేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.



జీఎస్టీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పల్నాడులో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంటు

జిల్లాలో 1,000 ఎకరాలు కేటాయింపునకు ఆదేశాలు


భూసేకరణపై అధికారులతో కలెక్టర్ కృతికాశుక్లా సమీక్ష

నరసరావుపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు కార్యాచరణ చేపట్టారు. ఈ ప్లాంట్‌కు వెయ్యిఎకరాలు భూమి అవసరమైంది. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు స్థలపరిశీలనపై శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ కృతికాశుక్లా సమీక్షించారు. జిల్లా పరిధిలో ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన 1,000 ఎకరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. వెల్దుర్తి మండలం రచ్చమల్లపాడు గ్రామ పరిధిలో సర్వే చేసిన భూమి అటవీశాఖకు సంబంధించినదని జేసీ సూరజ్ తెలిపారు. దీంతో రిలయన్స్ ప్లాంట్ ఏర్పాటుకు వేరొక స్థలం కేటాయించాలని కలెక్టర్ సూచించారు. గురజాల డివిజన్‌లో వివిధ మండలాల్లో ప్రభుత్వ భూములను గుర్తించాలని ఆదేశించారు. వెల్దుర్తి మండలంలో 75, దుర్గి మండలంలో 11, మాచర్ల మండలంలో 8 మొత్తం 94 ఎకరాలను నెడ్‌క్యాప్ సంస్థకు కేటాయించేందుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. వరికెపూడిశెల ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను వారంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వరికెపూడిశెల ఎస్ఈ వెంకటరత్నం, బనకచర్ల ప్రాజెక్టు ఈఈ శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బయోగ్యాస్ ప్లాంట్ స్థలం మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా

మహేశ్వరిగా అమ్మవారు



నరసరావుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని దేవాలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారికి విశేష అలంకారాలు చేస్తున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. పాతూరులోని శ్రీ గంగాపార్వతి సమేత భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం పార్వతి అమ్మవారికి మహేశ్వరి అలంకారం చేశారు. శ్రీశృంగేరి శంకర మఠంలో శారదాదేవి అమ్మవారికి మోహిని అలంకారం చేశారు. సత్తెనపల్లిరోడ్డులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ధనలక్ష్మీ అలంకారం, బాలయ్యనగర్‌లోని శ్రీ కల్యాణ సుందరేశ్వరస్వామి దేవాలయం, పాతూరు, రామిరెడ్డిపేటలోని శ్రీచౌడేశ్వరి దేవాలయాలు, నవోద యనగర్, ప్రధాన రహదారిలోని మహాలక్ష్మీ చెట్ల వద్ద ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు

రొంపిచర్ల, నకరికల్లు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటలకు మోతా దుకు మించి ఎరువులు వాడవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు రైతులకు తెలిపారు. శుక్రవారం రొంపిచర్ల మండలంలోని రొంపిచర్ల, నంత గుడిపాడు, విప్పర్ల గ్రామాల్లో సాగులో ఉన్న వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అధికంగా వాడితే తెగుళ్లు, పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకే పురుగు మందులు వినియోగించాలన్నారు.



దుకాణంలో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి జగ్గారావు

నిల్వల్లో తేడాలు ఉంటే చర్యలు

రికార్డుల్లో చూపే నిల్వకు, భౌతికంగా ఉండే ఎరువుల నిల్వలకు తేడా వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి జగ్గారావు తెలిపారు. నకరికల్లు, చల్లగుండ్ల ఎరువుల దుకాణాల్లో శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల గిడ్డంగుల్లోని యూ రియా భౌతిక నిల్వలను తనిఖీ చేశారు. ఎంఆర్‌పీకి మించి అమ్మితే లైసెన్స్ రద్దు చేయటమే కాక కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వంటిల్లు

దసరా పండుగ వస్తుందనగానే రకరకాల పిండి వంటలు చేసుకుంటూ ఉంటాం. ఒక్కో ప్రాంతంలో ఒక్కో వంటకం ప్రాశస్త్యంలో ఉంటుంది. మనం కూడా వాటిని ప్రయత్నించవచ్చు. ఎప్పటిలా కాకుండా ఈ పండుగ రోజున విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

విజయదశమికి వైరైటీగా..

పాల పాయసం (కేరళ)



కావాల్సిన పదార్థాలు

బాస్మతి బియ్యం- అర కప్పు, చిక్కటి పాలు- ఒక లీటరు, పంచదార- ఒక కప్పు, యాలకులు- నాలుగు, కుంకుమ పువ్వు రేకులు- అయిదు, నెయ్యి- రెండు చెంచాలు, జీడిపప్పు- కొద్దిగా, బాదం పలుకులు- కొన్ని, కిస్‌మిస్‌లు- కొన్ని, ఉప్పు- చిటికెడు

తయారీ విధానం: బాస్మతి బియ్యంలో నీళ్లు పోసి రెండుసార్లు కడగాలి. స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో మూడు కప్పుల నీళ్లు, కడిగిన బాస్మతి బియ్యం వేసి కలపాలి. మూతపెట్టి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి దించాలి. కుక్కర్ చల్లారాక మూత తీసి బాస్మతి అన్నాన్ని గరిటెతో మెత్తగా మెదపాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి బాగా మరిగించాలి. తరువాత అందులో బాస్మతి అన్నం మిశ్రమాన్ని వేసి బాగా కలుపుతూ పావుగంటసేపు ఉడికించాలి. ఆపైన పంచదార, యాలకుల పొడి, కుంకుమ పువ్వు రేకులు వేసి కలపాలి. పంచదార కరిగిన తరువాత పాయసం గిన్నెను స్టవ్ మీద నుంచి దించాలి. స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి నెయ్యి వేసి కరిగించాలి. అందులో జీడిపప్పు, బాదం పలుకులు, కిస్‌మిస్‌లు వేసి దోరగా వేయించి పాయసంలో కలపాలి. చివరగా చిటికెడు ఉప్పువేసి కలిపితే రుచికరమైన పాల పాయసం రెడీ!

దెహరోరి (ఛత్తీస్‌ఘర్)



కావాల్సిన పదార్థాలు

బియ్యప్పిండి- ఒక కప్పు, పెరుగు- ఒక కప్పు, బేకింగ్ సోడా- అర చెంచా, బొంబాయి రవ్వ- రెండు చెంచాలు, పంచదార- ఒక కప్పు, యాలకుల పొడి- అర చెంచా, నూనె- తగినంత, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పలుకులు- కొన్ని

తయారీ విధానం: వెడల్పాటి గిన్నెలో బియ్యప్పిండి, బేకింగ్ సోడా, బొంబాయిరవ్వ, యాలకుల పొడి, పెరుగు వేసి అరగ్లాసు నీళ్లు పోసి బాగా కలపాలి. ఆపైన గిన్నెమీద మూతపెట్టి నాలుగు గంటలు నాననివ్వాలి.

- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో చక్కెర వేసి కొన్ని నీళ్లు చిలకరించి వేడిచేయాలి. గులాబ్‌జామ్ పాకంలా రానివ్వాలి.
- స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికిపైగా నూనె పోసి వేడిచేయాలి. బియ్యప్పిండి మిశ్రమాన్ని చెంచాతో తీసుకుంటూ నూనెలో బోండాల మాదిరి వేయాలి. ఇవి దోరగా వేగిన తరువాత వాటిని తీసి పంచదార పాకంలో వేయాలి. పావుగంట తరువాత బోండాలన్నీ పూర్తిగా పాకం పీల్చుకుని దెహరోరీలు తయారవుతాయి. వీటి మీద జీడిపప్పు, బాదం పలుకులు చల్లి సర్వ్ చేయడమే.

ఈ రైతు బిడ్డ.. డీఎస్పీ



సంకల్పం

చిన్నప్పటి నుంచీ ఒకటే ఆశయం... ఉన్నత హోదా అలంకరించాలని. ఆ దృఢ సంకల్పమే ఆమెను లక్ష్యం వైపు నడిపించింది. కుటుంబ కష్టాలు... ప్రతికూల పరిస్థితులు... ఇవేవీ ఆమె అవరోధంగా భావించలేదు. చదివింది ప్రభుత్వ పాఠశాలలో అయినా... అకుంఠిత దీక్షతో అనుకున్నది సాధించారు. మండ్ల కవిత... ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 480వ ర్యాంకు సాధించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఎంపికయ్యారు. ఒక పేద రైతు బిడ్డ సాధించిన ఈ అపురూప విజయం 'నవ్య' పాఠకుల కోసం...

మండ్ల కవిత స్వస్థలం... వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని శానాయపల్లి. ఆమె తండ్రి మండ్ల నాగయ్య. తల్లి పార్వతమ్మ. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. కవిత రెండో కూతురు. పెద్ద కూతురు విజయలక్ష్మికి పెళ్లయింది. కుమారుడు సాయితేజ సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నాడు. వ్యవసాయమే ఆధారమైనా... పిల్లలను ఉన్నత చదువులు చదివించాలనుకున్నారు నాగయ్య. పంటపై వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో... వ్యవసాయ పనులతో పాటు జేసీబీ ఆపరేటర్‌గా కూడా పని చేశారు. ప్రస్తుతం గ్రామంలోనే పాల వ్యాపారం చేస్తున్నారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో కవిత విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే సాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. పదో తరగతిలో 9.7 జీపీఏతో ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. 2020లో బాసర ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 9.32 సీజీపీఏ సాధించారు.

వారి కష్టానికి ఫలితం: కవిత

"మమ్మల్ని చదివించడానికి మా నాన్న అహర్నిశలూ కష్టపడ్డారు. వ్యవసాయంతోపాటు ఇతర పనులు కూడా చేశారు. ఆ కష్టం వృథా కాకూడదని, నాపై అమ్మానాన్న పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని అనుకున్నాను. బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ముందుకు వెళ్లాను. ట్రాన్స్‌కోలో ఏఈగా ఉద్యోగం వచ్చినా... కచ్చితంగా సివిల్స్‌లో ఉద్యోగం సంపాదించాలనే ఉద్దేశంతోనే కోచింగ్‌కు వెళ్లాను. నాకు వచ్చిన మార్కులతో ఏ ఉద్యోగం వచ్చినా చేయడానికి సిద్ధపడ్డాను. ఇప్పుడు డీఎస్పీగా ఎంపికయ్యాను. ఎంతో ఆనందంగా ఉంది. నా కోసం అమ్మానాన్నలు పడ్డ కష్టానికి ఫలితం ఈ విజయం."

చిన్ననాటి కల...

2014లో పాఠశాల వార్షికోత్సవంలో కవిత ఉపన్యాసానికి... ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి ముగ్ధులయ్యారు. 'పెద్దయ్యాక ఏమవుతావు' అని ఆయన అడిగితే... 'కలెక్టర్ అవుతా' అంటూ ఆమె సమాధానం చెప్పారు. అదే లక్ష్యంతో పట్టుదలగా చదివారు. సివిల్స్‌కు సన్నద్ధం అవుతున్న క్రమంలో టీజీ ట్రాన్స్‌కోలో ఏఈగా ఎంపికయ్యారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని శ్రీరంగాపురం ఏఈగా పని చేశారు. అంతటితో ఆమె సంతృప్తి చెందలేదు. మళ్లీ గ్రూప్ వన్ కోసం ఎనిమిది నెలలు సెలవు పెట్టి తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందారు. చివరకు ఆమె కష్టం ఫలించింది. ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 480వ ర్యాంకు (బీసీ-ఏ విభాగంలో పదో ర్యాంకు) సాధించారు. డీఎస్పీగా అర్హత పొందారు. తమ కూతురు డీఎస్పీగా ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందంటూ ఆమె తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



• నోముల రవీందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్

దుర్గా నవరాత్రులు



నేటి అలంకారం

శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి

ఆశ్వయుజ శుద్ధ పంచమి, శనివారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఈ రోజు శ్రీ లలితా త్రిపురసుందరీదేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. త్రిపురాత్రయంలో లలితాదేవి రెండో శక్తి. దేవీ ఉపాసకులకు ఈ తల్లి ముఖ్యదేవత. త్రిగుణాతీతమైన కామేశ్వర స్వరూపం ఆమెది. లక్ష్మీ సరస్వతులు ఇరువైపులా ఉండి వింజామరలు వీస్తుండగా శ్రీచక్ర అధిష్ఠాన శక్తిగా ఆమె కొలువై ఉంటుంది. చెరుకుగడ, విల్లు, పాశాంకుశాలను ధరించి, శివుడి వక్షస్థలంపై కూర్చుని భక్తులకు వరాలిస్తుందనీ, పంచ, దశాక్షరీ మహా మంత్రాది దేవతగా తనను కొలిచే భక్తుల్నీ, ఉపాసకుల్నీ అనుగ్రహిస్తుందనీ భక్తులు నమ్ముతారు. లలితాదేవి విద్యా స్వరూపిణి. సమస్త సుఖాలు ప్రసాదించే శక్తి స్వరూపిణి అనీ, మాంగల్య సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందనీ భక్తుల విశ్వాసం. లలితాదేవి అనుగ్రహం కోసం సువాసినీ పూజ చెయ్యాలనీ, వివిధ పూలతో, కుంకుమతో అర్చించాలనీ పురాణాలు పేర్కొంటున్నాయి. త్రిమూర్తులు, సకల దేవతలు ఆమెను కొలుస్తారనీ, ఆమెను ఆరాధించిన వారికి ఎల్లప్పుడూ సుఖ సౌఖ్యాలు కలుగుతాయనీ చెబుతున్నాయి.

నైవేద్యం :
అల్లం గారెలు, ఐదురకాల తీపి పదార్థాలు

అలంకరించే చీర రంగు :
బంగారు వర్ణం

అర్చించే పూల రంగు:
వివిధ రకాలు

పారాయణ చెయ్యాల్సినవి:
లలితా సహస్రనామం.




అమ్మవారికి 4.50కోట్లతో అలంకరణ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలోని వాసవీమాతను శుక్రవారం రూ.4కోట్ల 50లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

- అమలాపురం, ఆంధ్రజ్యోతి





బెజవాడలో దసరా సందడి

బెజవాడలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఒకవైపు ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామివార్ల దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు, మరోవైపు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొంటున్నారు. శుక్రవారం ఐదోరోజు దుర్గమ్మ శ్రీమహాలక్ష్మి రూపంలో భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం దుర్గా ఘాట్ వద్ద కృష్ణా నవ హారతిని తిలకించడానికి వచ్చిన భక్తులు జయజయధ్వానాలతో ఆ ప్రాంతాన్ని మార్మోగించారు. బెజవాడలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉత్సవ వేదికలు భక్తులతో కళకళలాడాయి. పున్నమి ఘాట్ వద్ద సాంస్కృతిక సంబరాలు అంబరాన్ని తాకాయి. భవానీ మాలధారుల ప్రత్యేక దాండియా కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. చిన్నాపెద్దా కలిసి సందడి చేశారు.

మైసూరును మరిపిస్తున్న 'విజయవాడ ఉత్సవ్'

- ప్రశంసించిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి
- ఉర్రూతలూగించిన బాలీవుడ్ గాయని అభిలిప్సా



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమా, సుజనాచౌదరి, కేశినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా

విజయవాడ సిటీ/విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశ వారసత్వ సంపదను పండుగలు రక్షిస్తాయని త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి అన్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఆయన సతీమణి రేణుకతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మైసూరు ఉత్సవాలను మరిపించేలా విజయవాడ దసరా ఉత్సవాలు జరుగుతున్నాయని ప్రశంసించారు. రాజులు కట్టిన ఎన్నో కోటలు కాలగర్భంలో కలిసిపోయాయని, ఆధ్యాత్మిక చింతన పెంచే ఆలయాలు సుస్థిరంగా ఈ నేలపై నిలిచిపోయాయని చెప్పారు. సంస్కృతి సంప్రదాయాలను ఇలాంటి ఉత్సవాలు ప్రతిబింబిస్తాయని, ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంచుతాయని అన్నారు. విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకోవడం తన అదృష్టంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డిని ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమ, సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, బుద్దా వెంకన్న తదితరులు ఘనంగా సత్కరించారు.

ఉప్పొంగిన ఆధ్మాతికత

పున్నమి ఘాట్‌లో ఐదో రోజు శుక్రవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. బాలీవుడ్ గాయని అభిలిప్సా పాండా తన అద్భుత గాత్రంతో కృష్ణమ్మ ఒడిలో ఆధ్యాత్మికతను ఉప్పొంగించారు. గర్బా నైట్‌లో భాగంగా హిందీ పాటకు దాండియా బృందంతో నాట్యం చేయించారు. స్థానిక కళాకారులు మహిషాసుర సంహారాన్ని నృత్యరూపంలో కళ్లకు కట్టారు.

ఉత్సవ్‌లో నేటి కార్యక్రమాలు

శనివారం సాయంత్రం గొల్లపూడిలో విజయవాడ ఎగ్జిబిషన్‌ను సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభిస్తారు. తర్వాత సింగర్ సునీల్ లైవ్ మ్యూజిక్ జరుగుతుంది. పున్నమి ఘాట్‌లో శాస్త్రీయ నృత్య ప్రదర్శన, డివోషనల్ లైవ్ కార్యక్రమం ఉంటుంది. తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా.. రాజమహేంద్రవరానికి చెందిన నాట్యాచారిణి డాక్టర్ లలిత సిందూరి శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, సంగీత కచేరి, మ్యాజిక్ షో, వీరనాట్యం, తోలుబొమ్మలాట, సాంఘిక నాటకం తదితర కార్యక్రమాల ప్రదర్శన జరుగుతాయి. ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో.. ఆంధ్రనాట్యం, సంగీత కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శన, బుర్రకథ, తోలుబొమ్మలాట, పౌరాణిక పద్య నాటకం శ్రీకృష్ణ తులాభారం తదితర కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

దర్శకుడు వైవీఎస్ చౌదరికి మాతృవియోగం



దర్శకుడు, నిర్మాత వైవీఎస్ చౌదరి మాతృమూర్తి రత్నకుమారి (88) కన్నుమూశారు. గురువారం రాత్రి ఆవిడ తుది శ్వాస విడిచినట్లు దర్శకుడు చౌదరి తెలిపారు. 'లారీ డ్రైవర్ అయిన మా నాన్న యలమంచిలి నారాయణ రావు సంపాదనతో మా అమ్మ మమ్మల్ని పెంచి పెద్ద చేశారు. పనిమనిషి ప్రమేయం లేని జీవితాన్ని మాకు అందించాలనే తపనతో ప్రతి రోజూ తెల్లారే లేచి అన్నీ తానే చేసేవారు. మమ్మల్ని పెంచడానికి తన జీవితాన్ని అంకితం చేశారు. మా అవసరాలకు తగ్గట్లుగా తన నోటి లెక్కలతోనే బడ్జెట్ కేటాయించిన ఆర్థిక రంగ నిపుణురాలు మా అమ్మ. ఆవిడకు తెలిసిన లెక్కలు, మమ్మల్ని పెంచిన విధానం ఏ చదువు, ఏ విద్యా నేర్పించలేనివి. తన విధానాలతో మాలో కూడా స్ఫూర్తిని నింపిన మహనీయురాలు మా అమ్మ' అంటూ నివాళులు అర్పించారు వైవీఎస్ చౌదరి.

సంక్రాంతికి వినోదాల విందు



తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి మరో కుటుంబ కథా చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. మారి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సంక్రాంతికి కానుకగా 2026 జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా ఈ చిత్ర టీజర్‌ని యూనిట్ విడుదల చేసింది. బంగారు ఆభరణాల ప్రకటనతో టీజర్ ప్రారంభమౌతుంది. సినిమా ప్రోమోలో భాగంగా ఒంటి నిండా ఆభరణాలు ధరించిన మీనాక్షి చౌదరి, తమ సినిమాకు బదులు ఆభరణాల గురించి మాట్లాడుతుంది. దాంతో నవీన్ పొలిశెట్టి ఆమె ఆభరణాలను తాను ధరించి 'అనగనగ ఒక రాజు' సినిమా సంక్రాంతికి వస్తోంది అని చెప్పడం సరదాగా ఉంది. టీజర్‌లో నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి పోటీ పడుతూ నవ్వులు పంచారు. ఈ చిత్రానికి డీవోపీ: జె.యువరాజ్, సంగీత దర్శకుడు: మిక్కీ జె.మేయర్.

మరోసారి భయపెట్టనున్న నవాజుద్దీన్



ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్న జంటగా ఆదిత్య సర్పోత్‌దార్ తెరకెక్కించిన రొమాంటిక్ హారర్ కామెడీ చిత్రం 'థామ్మా'. మడాక్ ఫిల్మ్స్ బేనర్‌పై దినేశ్ విజన్, అమర్ కౌశిక్ నిర్మిస్తున్నారు. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా ఇప్పటికే వచ్చిన 'స్త్రీ', 'ముంజ్యా', 'భేదియా', 'స్త్రీ 2' చిత్రాలు ప్రేక్షకులను మెప్పించాయి. ఇప్పుడు అదే కోవలో 'థామ్మా' వస్తోంది. దీపావళి సందర్భంగా అక్టోబరు 21న థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా యూనిట్ ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేసింది. 'యక్షాసన్' అనే భేతాళుడి పాత్రలో నవాజుద్దీన్ సిద్దిఖీ కట్టి పడేశారు. మరోసారి ప్రేక్షకులను నవాజుద్దీన్ తన భీకర నటనతో భయపెట్టబోతున్నట్లు ట్రైలర్‌ని చూస్తే అర్థమవుతోంది.

'దృశ్యం 3' సెట్‌లో మోహన్‌లాల్‌కు సత్కారం



ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ పురస్కారం అందుకొన్న మలయాళ చిత్రరంగ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు శుక్రవారం 'దృశ్యం 3' చిత్రం సెట్‌లో సాదర స్వాగతం లభించింది. ఆ చిత్రంలో మోహన్‌లాల్‌కు భార్యగా నటిస్తున్న మీనా, దర్శకుడు జీతూ జోసెఫ్ అభినందనలు తెలిపి, కేక్ కట్ చేయించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను మీనా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

'అవతార్ 3' విడుదలకు సిద్ధం



హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన అద్భుత ప్రపంచం 'అవతార్' సంచలన విజయాలు నమోదు చేసిన విషయం విదితమే. హాలీవుడ్ రూపురేఖలనే మార్చేసిన ఈ అవతార్ యూనివర్స్‌లో ఇప్పటికే రెండు భాగాలు విడుదలై ప్రేక్షకులను మెప్పించాయి. ఇప్పుడు మూడో భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్' డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రెండు నెలల క్రితమే ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. తాజాగా మరో కొత్త ట్రైలర్‌ని విడుదల చేసింది. ఇందులో పోరాట ఘట్టాలు కట్టిపడేసేలా ఉన్నాయి. రెండు తెగల మధ్య జరిగిన యుద్ధాన్ని దర్శకుడు అద్భుతంగా ఆవిష్కరించారు. అలాగే పండోరాకు చెందిన అద్భుతమైన నీటి అడుగు ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకులకు అందించనుంది.

పారిశ్రామిక ప్రగతికి..
బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు: చీఫ్ విప్ జీవీ



వినుకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంపద సృష్టి, పెట్టుబడులు, పరిశ్రమల ఆకర్షణలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు, వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు పోలికే లేదని వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. శాసనసభలో పెట్టుబడులు, మౌలిక వసతులు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 2014-19 మధ్య చంద్రబాబు చేసిన అభివృద్ధి, 2019-24 మధ్య జగన్ చేసిన అరాచకాలే అందుకు నిదర్శనమన్నారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు సైబరాబాద్‌ను నిర్మిస్తే 30 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. కానీ, దోపిడీ వేధింపుల తప్ప మరేం పట్టని జగన్ రాష్ట్రంలో ఉన్న అమర్‌రాజా, లూలూ వంటి సంస్థల్ని తరిమేసి.. ఉన్న ఉద్యోగాలు లేకుండా చేశారని మండిపడ్డారు. అందుకే ప్రజలంతా చంద్రబాబును బ్రాండ్ అంబాసిడర్ అనుకుంటూ ఉంటే.. జగన్‌ను దోపిడీ, పరిశ్రమలను వెళ్లగొట్టడానికి బ్రాండ్ అంబాసిడర్‌గా చూస్తారని చురకలు వేశారు. రానున్న 15, 20 ఏళ్లు కూడా ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని, లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి దేశంలోనే ఏపీ అత్యుత్తమ స్థానంలో నిలవనుందన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో.. సామాన్యులకు ఉపయోగం
● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



ప్రచార కార్యక్రమంలో కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ శ్లాబులు తగ్గించడం వలన సామాన్యులకు ఉపయోగంగా ఉందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రం నరసరావుపేటలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్. కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన కొమ్మాలపాటి మాట్లాడుతూ.. ఒక సామాన్య కుటుంబానికి నెలకు రూ.3,750లు ఆదా కావడానికి అవకాశం ఉందన్నారు. లగ్జరీలు తగ్గించుకొని.. స్వదేశీ వస్తువులను వాడుతూ మేడ్ ఇన్ ఇండియా ప్రధాని నరేంద్ర మోదీ నినాదాన్ని ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. నరసరావుపేటలో ప్రతి వ్యాపారి తగ్గించిన జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలకు చేరడానికి ఆలోచిస్తున్నారని, వారికి కూడా ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నాగవరపు సుబ్బరాయగుప్త మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ప్రజలు దసరాను ఆనందగా జరుపుకోవడానికి జీఎస్టీ తగ్గించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు పరిశ్రమలు తీసుకొస్తూ.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, కొక్కిర శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, కొట్టా కిరణ్ , కొల్లి ఆంజనేయులు, అత్తులూరి వెంకట సుబ్బారావు, దాసరి ఉదయశ్రీ పాల్గొన్నారు.

23,715 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 19,406 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 23,715 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 4,387 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14300	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14100	334	10500	14400
273	----	-----	నెంబరు. 5	10000	14200
341	10000	15000	273	---	----
4884	----	----	341	10000	15200
సూపర్ 10	---	----	4884	10000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14500	తేజ	10000	14700
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10000	15000	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7000

స్థిరమైన అభివృద్ధి మార్గం..పర్యాటకం
● బాపట్లకు ఆహ్లాదం, ఆదాయం.. సూర్యలంక తీరం ● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం





సూర్యలంకలో..పర్యాటకుల సందడి, ఎకో టూరిజం కాటేజిలు

బాపట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదం, ఆదాయం, ఆరోగ్యం.. కలగలిపిన అభివృద్ధి మార్గం పర్యాటకం. ప్రకృతిని ఆస్వాదిస్తూ.. కాలుష్యాన్ని కట్టడి చేస్తూ.. ఈ రంగాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవం. ఐక్యరాజ్య సమితి ప్రయాణం, ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక అవగాహన, స్థిరమైన అభివృద్ధిని పర్యాటక సంస్థ ఎలా ప్రోత్సహిస్తుందో హైలెట్ చేస్తుంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం అనేది సమాజంలో పర్యాటక పాత్ర గురించి అవగాహన పెంపొందించటానికి అంకితమైన ఒక ప్రధాన అంతర్జాతీయ ఆచారం. ఈ ప్రపంచ పర్యాటక దినోత్సవం మన ప్రయాణాలను రాబోయే తరాలకు మరింత బాధ్యతాయుతంగా, స్థిరంగా మార్చాలని గుర్తు చేస్తుంది.

ఏపీలో బీచ్ టూరిజం

ఆంధ్రప్రదేశ్‌లో బీచ్ టూరిజం అభివృద్ధికి ఎంతో అవకాశం ఉంది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకు బారువ, కళింగపట్నం, భీమునిపట్నం, రుషికొండ, విశాఖ, గంగవరం, అల్లవరం, మంగినపూడి, సూర్యలంక, ఓడరేవు, కొత్తపట్నం, మైపాడు వంటి ప్రాంతాలు బీచ్ టూరిజానికి ప్రసిద్ధి చెందాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆంధ్రా గోవాగా ఖ్యాతి పొందిన బాపట్లలోని సూర్యలంక సముద్ర తీరానికి తెలుగు రాష్ట్రాలు నుంచి పర్యాటకులు విశేష సంఖ్యలో తరలి వస్తున్నారు. అర్ధ చంద్రాకారంలో ఇక్కడి సముద్రపు తీర ప్రాంతం.. స్వచ్ఛంగా, నిర్మలంగా ఉంటుంది. ఇక్కడ పరిసరాలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలుగుజేస్తాయి. సూర్యలంక సుందరమనోహర వేదికగా విరాజిల్లుతుంది.

గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్స్..థీమ్..

ప్రతిసంవత్సరం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఒక ప్రత్యేక థీమ్‌తో జరుపుకుంటారు. 2025 థీమ్ పర్యాటకం గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఈ థీమ్ స్థిరమైన పర్యాటక మౌలిక సదుపాయాలు, భూమిని రక్షించడంలో సహాయపడే ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్‌లు పర్యాటక వ్యాపారాలు, ప్రయాణికులను అందరికి మెరుగైన భవిష్యత్తును నిర్మించే ఎంపికలను ఎంచుకోవడాకి ప్రోత్సహిస్తాయి.

ఉపాధి కల్పన..

పర్యాటకం లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా స్థానిక వ్యాపారాలను పెంచుతుంది. విభిన్న నేపథ్యాల ప్రజల మధ్య అవగాహన, గౌరవం, ప్రశంసలను పెంపొందిస్తుంది. బాధ్యతాయుతమైన పర్యాటకం సమాజాలు తమ వారసత్వం, సంప్రదాయాలను కాపాడుకోవటానికి సహాయపడుతుంది.

బీచ్ ఫెస్టివల్ రద్దు..

ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజు సూర్యలంక సముద్ర తీరంలో రూ. 97.52 కోట్లు వెచ్చించి అనేక ప్రాజెక్టుల రూప కల్పనకు శ్రీకారం చుట్టాలని భావించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారా శంకు స్థాపన చేయించాలని చూశారు. అయితే దీనికి ప్రకృతి సహకరించ లేదు. వాతావరణంలో చోటు చేసుకున్న పెనుమార్పులతో కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడింది.

సర్వీస్ ఈనాం భూముల సమస్యతో ఇబ్బందులు
● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సర్వీస్ ఈనాం భూముల సమస్యతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, చిలకలూరిపేటలో నివసిస్తున్న సగం మంది ప్రజలకు ఈ సమస్య ఉందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. 22ఏ(1)సీ గా ఉన్న ఈ సమస్య కారణంగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయన్నారు. ఎంతోమంది తమ ఆస్తులను అమ్ముకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో పరిష్కరించకుంటే ప్రజలు తీవ్ర ఆందోళనతో నిరసన వ్యక్తం చేసే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యపై వేసిన సబ్ కమిటీ విచారణ ఏ దశలో ఉందో, సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియక ఆందోళన పడుతున్నారని చెప్పారు. ఈ సమస్య పరిష్కారమైతే ప్రజలు ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియచేయవలసిందిగా సభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

చెస్‌ను ప్రపంచానికి పరిచయం చేసిన భారత్
● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు (విద్య) సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి చెస్ క్రీడను పరిచయం చేసిన ఘనత భారతదేశం సొంతమని.. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న 62వ జాతీయ చెస్ పోటీలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ క్రీడ వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందిస్తుందన్నారు. ఈ ఆట వినయాన్ని, ఓటమిలో గౌరవాన్ని నేర్పుతుందన్నారు. డాక్టర్ పెమ్మసాని ముందుగా గ్రాండ్ మాస్టర్ ఎంఆర్ లలిత్‌బాబుతో ఒక ఎత్తు వేసి ఆటను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాభారతం కాలం నుంచి నేటి వరకూ భారతదేశానికి చెస్ క్రీడలో గొప్ప మేధో సంపద, చారిత్రక వారసత్వం ఉందన్నారు. క్రీడాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా కృషి చేస్తున్నాయన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.40 అడుగులు ఉంది. ఇది 305.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8,529, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,251, 22 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగులు, 4 క్రస్ట్‌గేట్లను పది అడుగులు మేర ఎత్తి 2,30,182, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,73,762 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 2,73,762 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



విద్యుత్ కాంతుల మధ్య విడుదలవుతున్న నీరు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచింల ప్రాజెక్టులో శుక్రవారం 37.32 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,50,865 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, తొమ్మిది గేట్ల ద్వారా రూ 2,62,998, మొత్తం 2,79,998 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



చప్పిడి రాము మృతదేహం

దుర్గి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బైకును ఎదురుగా వచ్చిన అశోక్ లేలాండ్ వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అడిగొప్పుల వద్ద శుక్రవారం జరిగింది. రాజుపాలెం మండలం దేవరపాడుకు చెందిన చప్పిడి రాము (35) మాచర్ల పట్టణంలోని వివాహ వేడుకకు హాజరై.. పెళ్లికుమార్తె స్వగ్రామమైన మండలంలోని అడిగొప్పులకు బయలుదేరాడు. అడిగొప్పుల కుడి కాలువ వద్ద మాచర్ల వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం బైకును ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన రామును మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అప్పటికే మృతిచెందాడు. దుర్గి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద మృతి..



గుర్తుతెలియని మృతదేహం

నరసరావుపేట లీగల్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఇసప్పాలెం గ్రామ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఇస్సపాలెం నుంచి జొన్నలగడ్డ వైపు వెళ్లే రోడ్డులోని నీటి కుంటలో ఓ వ్యక్తి శవం ఉందన్నారు. సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని, మృతదేహం కుడి ఎడమ చాతిపై పచ్చ బొట్టు ఉన్నట్టు తెలిపారు. గుర్తుపట్టినవారు నరసరావుపేట రూరల్ ఎస్సై సెల్ నెంబర్ 94407 96244కు సమాచారం తెలియజేయాలని కోరారు.

బాపట్లలో విజిలెన్స్ విచారణ

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలోని ఓ కార్యాలయంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అయితే అధికారులు మాత్రం దీనిని గోప్యంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. ఒక అధికారితో ఏకాంతంగా మాట్లాడి కొన్ని పత్రాలు అడిగినట్లు తెలిసింది. దీంతో అధికారులు ఎందుకొచ్చారో ఏమిటో అంటూ చర్చించుకుంటున్నారు. అయితే వివరాలు మాత్రం బయట పెట్టలేదు.

పనులు ప్రారంభం
(5వ పేజీ తరువాయి)

నిర్మించేందుకు బాత్‌మెట్రిక్ సర్వే కూడా పూర్తయింది. నీటిశుద్ధి ప్లాంట్ శంకుస్థాపనకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌ను శంకుస్థాపనకు అధికారులు ఆహ్వానిస్తున్నారు. వచ్చే నెలలో పనులు ప్రారంభించే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.



ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనం

రెండో విడతలో వాటర్ గ్రిడ్‌కు రూ.2,200 కోట్లతో డీపీఆర్

రెండో విడతలో పథకాన్ని జిల్లాలోని 18 మండలాల్లోని 468 గ్రామాలకు అమలు చేయనున్నారు. రూ.2,200 కోట్లు వ్యయ అంచనాలను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ రూపొందించింది. ఇందుకు డీపీఆర్‌ను అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. మరో ఏడాదిలో రెండో విడత పనులు ప్రారంభించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

అభివృద్ధి నిధుల కోసం సీఎంకు వినతి



సీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజక వర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. వెలగడపూడిలోని సచివాలయంలో శుక్రవారం సీఎంను కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రహదారులు, పాఠశాలలు, వైద్య సదుపాయాలు, తాగు, సాగు నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	120, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

29న అమరావతిలో జాబ్ మేళా

తుళ్లూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా(స్పెషల్ డ్రైవ్) నిర్వహించనున్నారు. ఈ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతి పరిసర ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతోందని సీఆర్డీఏ విజయవాడ ప్రధాన కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ జాబ్ మేళాలో టీయూవీ ఇండియా, భవ్య హెల్త్ సర్వీసెస్, మొక్సి ఐటీ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారు. టెన్త్, డిగ్రి(బీకామ్), బీటెక్(సివిల్ ఇంజినీరింగ్) పూర్తి చేసిన అభ్యర్థులు ఈ స్పెషల్ డ్రైవ్ జాబ్ మేళాకు హాజరుకావచ్చు. స్పెషల్ డ్రైవ్ జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలకు గ్రామంలోని సీఆర్డీఏ ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు. లేదా శంకర్ 98484 24207, శ్రీకర్ 99634 25999 నంబర్లకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు సంప్రదించవచ్చు. జాబ్ మేళాలో పాల్గొనేవారు నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి.

హిందూపూర్ వరకు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

గుంటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మచిలీపట్నం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ని హిందూపూర్ వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. నవంబరు 20 నుంచి 26వ తేదీ వరకు 17215 మచిలీపట్నం - హిందూపూర్ ఎక్స్‌ప్రెస్‌గా ప్రయాణిస్తుంది. ఈ రైలు ధర్మవరం రైల్వేస్టేషన్‌కు ఉదయం 9.50 గంటలకు చేరుకొని 10 గంటలకు బయలుదేరి 10.25కి శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, మధ్యాహ్నం 12.15కి హిందూపూర్ చేరుకుంటుంది. 17216 హిందూపూర్ - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ నవంబరు 21వ తేదీ నుంచి 27 మధ్యన హిందూపురంలో మధ్యాహ్నం 3.30కి బయలుదేరి సాయంత్రం 4.18కి శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, 5.20కి ధర్మవరం చేరుకొని మచిలీపట్నంకు బయలుదేరుతుంది.

హైటెక్ సిటీ, చర్లపల్లిలో.. రైళ్ల తాత్కాలిక నిలుపుదల

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసర పండగ సెలవుల రద్దీ దృష్ట్యా నరసపూర్, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లకు హైటెక్ సిటీ, చర్లపల్లి రైల్వేస్టేషన్లలో నిలుపుదల సౌకర్యాన్ని రైల్వే శాఖ కల్పించింది. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు హైటెక్ సిటీకి సాయంత్రం 6.48కి చేరుకొని 6.49కి బయలుదేరుతుంది. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఆయా తేదీల్లో ఉదయం 6.20కి హైటెక్ సిటీకి చేరుకొంటుంది. 17255 నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ చర్లపల్లికి వేకువజామున 3.44 గంటలకు, హైటెక్ సిటీకి 4.44కి చేరుతుంది.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

అత్యంత పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ

● టీడీపీ సీనియర్ నేత యాగంటి

మాచర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం విజయవంతంగా డీఎస్సీ నిర్వహించి 15941 ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చి, అత్యంత పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించారని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతియేటా కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహిస్తుందన్నారు. కొంత మంది సంఘ విద్రోహ శక్తులు మెగా డీఎస్సీ నిలిపివేయాలని కోర్టులో కేసు వేశారని, సీఎం చంద్రబాబు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించారని యాగంటి కొనియాడారు.

సంక్షిప్తం...

● **సత్తెనపల్లి** : ఆరోగ్యం బాగుంటేనే సంతోషకరమైన జీవనం సాధ్యమని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు అన్నారు. స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం ఏరియా వైద్యశాలలో వివిధ ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఏరియా వైద్యశాల గైనకాలజిస్టు డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారా క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చన్నారు. డాక్టర్ గిరిరాజు వివిధ ఆరోగ్య సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

● **పిడుగురాళ్ల** : జానపాడు గ్రామంలో శుక్రవారం కూడా ఇంటింటి సర్వే నిర్వహించారు. స్వస్థ్‌నారీ - స్వశక్త్ పరివార్ అభయాన్‌లో భాగంగా 102 గృహాలను సందర్శించి వైద్యాధికారి కెప్రభావతి వైద్యపరీక్షలు నిర్వహించారు. సీహెచ్ పద్మ, సునీత, శ్రీలక్ష్మీ, అనూష, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

● **నకరికల్లు:** మహిళలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు ప్రభుత్వం ఎస్ఎన్ఎస్‌పీఏ కార్యక్రమం నిర్వహిస్తుందని డాక్టర్ ఎం.పూజాశ్రీ తెలిపారు. శుక్రవారం కుంకలగుంట- 2 సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళలకు అందిస్తున్న సేవల గురించి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సింగరాజు అంకారావు, ఆరోగ్య విస్తరణ అధికారి కొంపల వెంకటేశ్వర్లు, హెల్త్ విజిటర్ శాంతకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జేవీ నామగణి, సూపర్ వైజర్ రాధాకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● **సత్తెనపల్లి** : బీజేపీ నాయకుడు కామినేని శ్రీనివాసరావు అసెంబ్లీలో ప్రస్తావించిన వ్యాఖ్యలు బాధాకరమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయ భాస్కర రెడ్డి అన్నారు. శుక్రవారం తన గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామినేని వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్యే బాలకృష్ణ విచక్షణా రహితంగా మాట్లాడటం తగదన్నారు. కేంద్ర మాజీ మంత్రి చిరంజీవిని బాలకృష్ణ ఏకవచనంతో సంబోధించటం బాధాకరమన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలపై జనసేన నాయకులు స్పందించలేదన్నారు.

● **సత్తెనపల్లి** : కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి గురించి మాట్లాడే వ్యక్తులు ఆచితూచీ మాట్లాడాలని జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిరంజీవి గురించి తప్పుగా మాట్లాడితే సహించేది లేదన్నారు. ఏ పార్టీ వారైనా దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

● **అమరావతి** : మండలపరిధిలోని అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్ ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్ సిస్టమ్ ద్వారా సిబ్బంది విధులకు హాజరు కావాలన్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ పెంచాలని, ప్రాథమిక వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. డాక్టర్ మౌనిక వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● **మాచర్ల రూరల్** : వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యాన మాచర్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 25 మంది పేద మహిళలకు దుస్తులను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ గుర్రం రాజశేఖరరెడ్డి, ఓరుగంటి చెన్నకేశవరావు, షేక్ పాషావలి, బచ్చువెంకట సుబ్బారావు, ఊటుకూరి సత్యనారాయణ, చుండూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

● **పిడుగురాళ్ల** : చిట్యాల ఐలమ్మ జయంతి శుక్రవారం నిర్వహించారు. పట్టణానికి చెందిన శెట్టుపల్లి పూర్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు బీసీ సంఘ నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భీమవరపు కోటేశ్వరరావు, కంభంపాటి పెదవెంకటేశ్వర్లు, పొట్టసిరి చిన్నశంకర్, అంకారావు, సుబ్బారావు, కంభంపాటి సూర్య, మురికిపూడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● **కారంపూడి** : కారంపూడిలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. టీడీపీలోనే ఓ వర్గం వారు ఫ్లెక్సీలను చింపివేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధిష్టానం జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని నేతలు కోరుతున్నారు.

● **పిడుగురాళ్ల** : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక కుటుంబం.. ఒక వ్యాపారవేత్తలో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పిడుగురాళ్ల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు లోక్‌కల్యాణ మేళా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఐ.శ్రీనివాసులు తెలిపారు. వీధి విక్రయదారులకు, వారి కుటుంబసభ్యులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

● **పెదకూరపాడు** : మండలంలోని పాటిబండ్ల ఆర్‌సీఎం హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఈనెల 28వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థులు మనగోటి శివనారాయణ తదితరులు శుక్రవారం తెలిపారు.

ఉపాధ్యాయుల చేతిలో భావి భారతం

● మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల చేతుల్లోనే భావి భారతాన్ని తీర్చిదిద్దే శక్తి ఉంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. డీఎస్సీలో సత్తా చాటి నూతన ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న వారికి ఆయన అభినందనలు తెలిపారు. అమరావతి వేదికగా గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్న నియోజకవర్గ ఉపాధ్యాయులు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెగా డీఎస్సీలో నియోజకవర్గం నుంచి 98 మంది డీఎస్సీ అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

● రెంటచింతల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్ని వృత్తుల్లోకెల్లా భిన్నమైనదని ఉపాధ్యాయ వృత్తిని ఆ వృత్తికి ఉన్న గౌరవ మర్యాదలు ఇతర ఏ వృత్తులకు లేవని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. రెంటచింతలకు చెందిన మామిడి సుభాషిణి స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికవ్వగా ఎమ్మెల్యే జూలకంటి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు.

29న మెగా జాబ్ మేళా : ఎమ్మెల్యే

మాచర్ల రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సిల్క్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన ఈనెల 29వ తేదీన పట్టణంలోని ఎస్‌కేబీఆర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి శుక్రవారం తెలిపారు. టాప్ మల్టీనేషన్ కంపెనీలతో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత పాల్గొని ఉద్యోగాలు సాధించాలని ఆయన కోరారు. వివరాలకు 7702700990, 9492158153లను సంప్రదించాలన్నారు.

రైతుల అవసరాలకు సరి పడా యూరియా : ఏవో

దాచేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకు సరి పడా యూరియా కట్టలను సరఫరా చేస్తున్నామని, యూరియా కొరత లేదని దాచేపల్లి వ్యవసాయ శాఖ ఏవో వెంకటేష్ తెలిపారు. శుక్రవారం దాచేపల్లిలో రైతు సేవాకేంద్రంలో 20 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో డీసీ చైర్మన్ పగడాల భాస్కరరావు, బొమ్మిరెడ్డి సత్యం తదితర రైతులు ఉన్నారు.

● అచ్చంపేట మండలంలోని చిగురుపాడులో శుక్రవారం 19.8 టన్నుల యూరియాను తహసీల్దార్ చంద్రశేఖర్, ఏవో పీ వెంక టేశ్వర్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు గంధం కోటేశ్వరరావు పంపిణీని ప్రారంభించారు.

వెంకయ్య చౌదరికి ప్రముఖుల పరామర్శ

విజయపురిసౌత్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవో చిరుమామిళ్ల వెంకయ్యచౌదరిని శుక్రవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. గురువారం వెంకయ్య చౌదరి తండ్రి చిరుమామిళ్ల చలమయ్య అనారోగ్యంతో మృతిచెందారు. ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపతినాయుడు, సెంటర్ లేబర్ బోర్డ్ చైర్మన్ వల్లూరు జయప్రకాష్‌నారాయణ, 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్, స్విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ నారా ఆదికృష్ణ, మహా టీవీ ఎండీ మారెళ్ల వంశీకృష్ణలు మాచర్ల మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో గల వెంకయ్యచౌదరి స్వగృహానికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. అనంతరం చలమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన మహారాష్ట్ర ఎన్‌జీవో బృందం



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న మహారాష్ట్ర ఎన్‌జీవో బృందం

బెల్లంకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను అంజయ్ ఇంటిలికాప్, మహారాష్ట్ర ఎన్‌జీవో బృందం పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి పర్యవేక్షణలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పలు పంటలు, సాగు, కషాయాల వినియోగం, బీజా మృతం వంటి ప్రకృతి పద్ధతులను వివరించారు. బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్లో ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తొమ్మిది రాజీ లేని సూత్రాలను వివరించి రైతు సేవా కేంద్రాల్లో పీఎండీఎస్ కిట్లు, మహిళా సంఘాల పాత్ర, ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ బృందంతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● రాజుపాలెం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం, గణపవరం గ్రామాల్లో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి పర్యవేక్షణలో మహారాష్ట్రకు చెందిన ఎన్జీవో బృందం సందర్శించారు. రైతులు పలు రకాల పంటలు సాగు చేసే విధానం, కషాయాల వినియోగం, విత్తన శుద్ధి పద్ధతులను బృందానికి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, ఎంటీఎల్ పవన్, హెచ్ఎన్ఎఫ్ ప్రవీణ్, అనంతలక్ష్మీ ఉన్నారు.

హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

క్రోసూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ వ్యాధిపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ అన్నారు. శుక్రవారం మండలంలోని దొడ్లేరులో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మొబైల్ వాహనం ప్రొజెక్టర్‌తో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు.

● కారంపూడిలో శుక్రవారం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతురావు, గుమ్మడి నాసరయ్య, లక్ష్మణాచారి, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

● విజయపురిసౌత్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురి సౌత్‌లో నూతన బ్రిడ్జి సమీపంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి కొండ చరియలు విరిగిపడి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని రహదారికి అడ్డుగా ఉన్న రాళ్లను తొలగించారు.

ఆట్యా పాట్యా చాంపియన్ షిప్ పోటీలు

● విన్నర్స్‌గా పల్నాడు జిల్లా బాలుర, బాలికల జట్లు

నకరికల్లు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆట్యా పాట్యా చాంపియన్ షిప్ పోటీల ఎంపికలో పల్నాడు జిల్లా బాలుర, బాలికల జట్లు విన్నర్స్‌గా నిలిచినట్టు స్టేట్ సెక్రటరీ ఆర్ చరణ్ తెలిపారు. రన్నర్స్‌గా పశ్చిమగోదావరికి చెందిన బాలుర జట్టు, కర్నూలు బాలి కల జట్టు ఎంపికైనట్టు వివరించారు. 3వ స్థానంలో గుంటూరు జిల్లా బాలుర బాలికల జట్లు ఎంపికైనట్టు తెలిపారు. ఆట్యా పాట్యా చాంపియన్ షిప్ పోటీలను నకరికల్లు వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయవంతంగా నిర్వహించారని సీఈవో ఆర్‌డీ ప్రసాదు అన్నారు. శుక్రవారం చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలకు ఎస్ఐ కే సతీష్, ఫిజికల్ డైరెక్టర్లు చింతా పుల్లయ్య, పీ ఝాన్సీరాణి, ఎంఈవో డీ బ్రహ్మేశ్వరరావు, హెచ్ఎం జాలాది శ్రీనివాసరావులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కాసా మల్లికార్జునరావు, సంతగుడిపాడు హెచ్ఎం కే శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్

వెల్దుర్తి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయం పరిధిలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే అంశంపై చిన్న తరహా వీధి వ్యాపారులు ర్యాలీ జరిపి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంజీవరెడ్డి, ఎంపీడీవో ప్రసాదరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు, సచివాలయ ఉద్యోగులకు తగ్గిన జీఎస్టీపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రత్నం మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు గ్రామాల్లో ప్రజలకు తెలియజేస్తారని అన్నారు.

తిరుమలలో పరకామణిని సైతం వదలని వైసీపీ



మహా పాపం పోస్టర్లను ఇళ్ళకు అతికిస్తున్న చౌట శ్రీనివాసరావు

సత్తెనపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ తిరుపతిలో పరకామణిని సైతం వదల్లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారా యణ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మహాపాపం పోస్టర్లను టీడీపీ కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరిగి ఆయన అంటించారు. కార్యక్రమంలో మారెళ్ళ స్వామి, బుడగాల సుబ్బారావు, జింకా లోకేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, భగ్గి సత్యవతి తదితరులు ఉన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

నకరికల్లు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా లెప్రసి, టీబీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ కండ్లకుంట మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం కుంకలగుంట- 2 సచివాలయంలో ఎస్ఎన్ ఎస్‌పీఏ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నకరికల్లు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన సంఘటన ఇది. ఎస్ఐ కే సతీష్ తెలిపిన వివరాల ప్రకారం బొల్లాపల్లి మండలం మర్రిపాలేనికి చెందిన బచ్చలకూరి వెంకయ్య, మాధవరావు బైక్‌పై నరసరావుపేట వెళ్లి తిరిగి మర్రిపాలెం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కుక్కలను తప్పించబోయి అదుపు తప్పి బైక్ కింద పడింది. ఈ ప్రమాదంలో బచ్చలకూరి వెంగయ్య(55) తలకు తీవ్ర గాయమై జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గోతాల లారీ బోల్తా

నకరికల్లు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్న గోతాల లారీ శుక్రవారం బోల్తా పడింది. లారీ అదుపు తప్పటంతో రోడ్డు పక్కకు పడిపోయింది. ఆ సమయం లో అక్కడ ఏమి లేక పోవటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది.

ఘనంగా దేవీశరన్నవరాత్రులు

● మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు
● భక్తులతో కిటకిట లాడిన ఆలయాలు



ధనలక్ష్మీ అలంకరణలో వాసవీ అమ్మవారు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకొని పట్ట ణంలోని అన్ని దేవాలయాల్లో దేవీ శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ధనలక్ష్మీదేవిగా, కనకదుర్గ అమ్మ వారి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా, కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనలక్ష్మీదేవి గా భక్తులకు దర్శనమిచ్చారు. నాగులగుడి, షిరిడీ సాయిమందిర్, భగవాన్ సత్యసాయి దేవాలయం, గంగమ్మతల్లి దేవాలయంలో కుంకుమపూజలు నిర్వహించారు.

● దాచేపల్లి: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకొనేందుకు, కుంకుమ పూజల్లో పాల్గొనేందుకు అధికసంఖ్యలో తరలిరావటంతో ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి.

● మాచవరం: మండలంలోని చెన్నాయపాలెంలోని రేణుకా అమ్మవారిని శ్రీమహాలక్ష్మి దేవిగా, శివాలయంలో భ్రమరాంబ అమ్మవారిని ధనలక్ష్మి దేవిగా, వాసవీ అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమరావతిలో మహాలక్ష్మీగా బాలచాముండికా అమ్మవారు

● అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బాల చాముండికా సమేత అమరేశ్వరా లయంలో అమ్మవారిని మహాలక్ష్మీగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని రూ.14 లక్ష లతో ధనలక్ష్మీగా అలంకరించారు. పెద్దింటమ్మ ఆలయంలో ధనలక్ష్మీగా అలంకరించారు.



క్రోసూరులో కరెన్సీతో అలంకరించిన ధనలక్ష్మీదేవి రూపం

● బెల్లంకొండ: వ ం హాలక్ష్మీ దే వి అమ్మవారు ధన లక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీపులుపుల వెంకట ఫణికుమార్ శర్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

● క్రోసూరు: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రూ.70 లక్షల కరెన్సీతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవై శ్య వర్తకసంఘం వారితో పాటు దేవాలయ పాలకవర్గం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు వహించారు. మండలంలోని అనంతవరం కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కాత్యాయనీదేవి అలంకారానికి మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. సహస్ర నామార్చనలు, లలిత పారాయణం జరిగాయి.

● పెదకూరపాడు: బొమ్మలగుడి దేవాలయం, వేణుగోపాలస్వామి దేవాలయం, శివాల యం, రామాలయం ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్లను అలంకరించి పూజలను నిర్వహించారు. 75 తాళ్ళూరులోని కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో మహాలక్ష్మీదేవి అమ్మవారుగా అలంకరించి పూజలను చేశారు.



సత్తెనపల్లి పార్కు ఏరియాలో అమ్మవారికి అలంకారం

● సత్తెనపల్లి : వడ్డవల్లి బొడ్రాయి సెంటర్లో అమ్మవారికి మహాలక్ష్మీదేవిగా, పార్కు ఏరియాలో అమ్మవారిని భక్తులు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శన మిచ్చారు.

● నకరికల్లు: నరసింగపాడులోని గంగా అన్నపూర్ణాదేవిగా, చేజర్లలో మహేశ్వరి అలంకారంలో, కుంకులగుంటలో లలిత త్రిపురసుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

● ముప్పాళ్ళ: మండలంలోని మాదల ఎస్టీ కాలనీలో అమ్మవారు మహాలక్ష్మీగా దర్శన మిచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కుంకుమ పూజాకార్యక్రమాలలో పాల్గొన్నారు.



మాచర్లలో సంతానలక్ష్మీగా శ్రీవాసవీ అమ్మవారు

● మాచర్ల రూరల్: మాచర్ల పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు సంతానలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● రెంటచింతల : జంక్షన్‌లోని దుర్గమ్మ ధనలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. నగదుతో అలంకరించిన తీరు చూడముచ్చటగా వుంది.

● విజయపురిసౌత్: స్థానిక మెయిన్ బజారులోని కనకదుర్గ అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.10,21,550 కరెన్సీ నోట్లతో అలంకరించారు.

● కారంపూడి: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు వారాహీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 54 మంది దంపతులు కుంకుమ పూజలు జరిపారు.

● దుర్గి : దుర్గిలోని ముటుకూరు రోడ్డులో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అమరేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

● అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతి లోని అమరేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసేలా చూడాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ దశాబ్దకాలంగా అమరావతి పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. అమరావతిలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌తో పాటు దేవాలయంలో నిద్ర చేసేందుకు వచ్చే వారికి అవసరమైన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, నిద్ర చేయటానికి వసతుల్లేక చెట్టుకింద పండుకొనే పరిస్థితి ఉందన్నారు. దేవదాయశాఖ మంత్రి అమరేశ్వర స్వామి దేవాలయాన్ని పరిశీలించి అవసరమైన నిధులను మం జూరు చేయాలని, శివరాత్రి ఉత్సవాలను రాష్ట్ర ఉత్సవాలుగా కోటప్పకొండ, శ్రీకాళహస్తి దేవాలయాల్లో చేసినట్టు అమరావతిలో కూడా చేయాలని ఆయన కోరారు. రానున్న ఏడాదిలో వచ్చే శివరాత్రి ఉత్సవాలను రాష్ట్ర ఉత్సవాలుగా ప్రభుత్వం జరపాలని ఆయన కోరారు.

దుర్గమ్మని దర్శించిన శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి



దుర్గా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంజులారెడ్డి

రెంటచింతల, సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): వివిధ గ్రామాలకు కూడలిగా ఉన్న పాలువాయిజంక్షన్ లోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని శుక్రవారం శిల్పా రామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దుర్గమ్మ చల్లంగ చూడమ్మా అంటూ వేడుకుని కుంకుమార్చనలు చేశారు. ఆలయ చైర్మన్ ఏచూరి సాంబశివరావు, వేదపండితులు జిగురు చంద్రశేఖర శర్మ నేతృత్వంలో వేదమంత్రోచ్చారణలతో ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు. ఆమె వెంట ఆర్యవైశ్య నేత కొత్త అంజి, ఏచూరి కేదార్‌నాద్ తదితరులున్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

● ఆర్థిక సాయం అందించిన నిఖిల్



సుభాని కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతున్న యరపతినేని నిఖిల్

పిడుగురాళ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరాలపాడు గ్రామానికి చెందిన షేక్ సుభాని రోడ్డు ప్రమాదానికి గురై పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ సుభాని చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి పరామర్శించడంతో పాటు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చికిత్స నిమిత్తం రూ.15 వేలు నిఖిల్ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, దియ్యా రామకృష్ణ, మేకల రాంబాబు, వున్నం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తాళ్లూరి వెంకట సత్యనారాయణ ఎంపికయ్యారు. శుక్రవారం పిడుగురాళ్లలో జరిగిన కమిటీ సభ్యుల సమావేశంలో నూతన కమిటీ ఎంపిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా ముడెం పెదసత్యనారాయణ, అధ్యక్షుడిగా తాళ్లూరి వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా తాడికొండ బసవ నరసింహారావు, జి శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా యేలూరి వెంకట నారాయణ, కార్యదర్శిగా లమువరపు వెంకటేశ్వర్లు, షేక్ నాజ్‌మొహిద్దీన్, కోశాధికారిగా తాడేపల్లి రమేష్, ఉపకోశాధికారిగా గాదంశెట్టి సందీప్‌లు ఎంపికయ్యారు. రెండున్నర దశాబ్దాలుగా అధ్యక్షుడిగా సేవలందించిన కొత్తకోటి హనుమంతరావును కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

నాగుల్ మీరా మృతిపై శాఖాపరమైన విచారణ



నాగుల్ మీరా కుటుంబసభ్యుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న అసిస్టెంట్ డీఎంహెచ్‌వో పద్మావతి

అచ్చంపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం అసిస్టెంట్ డీఎంహెచ్‌వో ఇటీవల మృతి చెందిన నాగుల్ మీరా కుటుంబసభ్యుల నుంచి శుక్రవారం వినతిపత్రం స్వీకరించారు. ఆరోగ్య కేంద్ర డాక్టర్లతో, సిబ్బందితో మృతిపై విచారణ ప్రారంభించారు. అధికారులతో జరిగిన విషయాన్ని నమోదు చేశారు. నాగుల్ మీరా ఈనెల 26వ తేదీన ఆస్పత్రిలో సకాలానికి వైద్యం అందక మృతి చెందానే ఆరోపణలపై ఆరోగ్య కేంద్ర డాక్టర్ రాజేష్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో డాక్టర్లను, సిబ్బం ది వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ ఎం పద్మావతికి వినతిప త్రం అందించిన వారిలో ఎస్కే బాల సైదా, ఎస్కే కమల్, బీరువాల జానీ, ఎస్కే గాలీసా, మాబూవలి, ఆలీ బాషా తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలందరూ ఈకేవైసీ చేయించుకోవాలి

● డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి



మ్యాజిక్ డ్రైయిన్స్ నిర్మాణాలు పరిశీలిస్తున్న డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి

క్రోసూరు, సెప్టెంబ రు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉపాధి కూలీలందరూ అక్టోబరు 2వ తేదీ లోగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి అన్నారు. శుక్రవారం రాత్రి మ్యాజిక్ డ్రెయిన్స్ పైలెట్ గ్రామమైన గాదెవారిపాలెంను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మ్యాజిక్ డ్రెయిన్స్ నిర్మాణాలను పరిశీలించారు. 2వ తేదీ కల్లా నిర్మాణాలు పూర్తి చేయాలని, గ్రామం మొత్తం ఎటువంటి మురుగు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గ్రామంలో మొత్తం 550 మీటర్లు మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం చేయనున్నట్టు, దీని కోసం రూ.7 లక్షలు ఖర్చు చేయ నున్నట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట నారాయణ, ఉపాధి హామి ఏపీవో వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపితే మేలు కలుగుతుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎల్ఐసి కృష్ణారావు బజా రులోని అర్బన్ ప్రాథమిక వైద్యశాలలో స్వస్థనారీ - సశక్త్ పరివార్ అభయాన్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు ఎస్కే నస్రీన్, పి.అనిల్‌కుమార్‌లు మహిళలకు ప్రత్యేకంగా కొన్ని వైద్య పరీ క్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా పాల్గొన్నారు.

● బెల్లంకొండ : మండలంలోని మాచాయపాలెంలో శుక్రవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు కిరణ్‌కుమార్, దీపిక హాజరై ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. రోగులకు మాచాయపాలెం టీడీపీ నాయకుడు గుడిసె కొండయ్య ఉచిత భోజన సదుపా యాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మణికుమారి, సూపర్ వైజర్ బాషా, గ్రామపెద్దలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించిన చైర్మన్, కమిషనర్

చిలకలూరిపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కేటీ రోడ్డులో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబులు చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్లు సీహెచ్ రమణారావు, సునీత, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్, కమిషనర్ సమీపంలోని అన్న క్యాంటీన్‌కు వెళ్లి పరిశీలించారు. అక్కడ అల్పాహారం చేస్తున్నవారితో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.



పురుగుమందుల షాపులో తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ ఏడీఏ రవికుమార్, ఏవోలు

వ్యవసాయాధికారుల తనిఖీలు

వినుకొండటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలను వినుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి జీ వరలక్ష్మి, బొల్లాపల్లి మండల వ్యవసాయ అధికారి ఏ అంకారావు, ఈపూ రు మండల వ్యవసాయాధికారి రామారావు శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుమందుల డీలర్లు ఎవరైనా అనధికా రికంగా, సరైన పత్రాలు లేకుండా పురుగుమందులు విక్రయించరాదన్నారు. పర్మిషన్ ఉన్న డీలర్లు మాత్రమే వేరే జిల్లాలకు విక్రయించాలన్నారు. డీలర్లు స్టాక్ బోర్డు, ధరలు, లైసెన్సు కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ఎరువులు, పురుగు మందుల రిజిస్టర్లు రోజువారీ ఎప్పటికప్పుడు నమోదు చేయాలని లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామి వారు హెచ్చరించారు.

పీహెచ్‌సీలో జిల్లా లెప్రసీ అధికారి తనిఖీ



రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ

రొంపిచర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ కే మురళీకృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో అందుతున్న సేవలపై వైద్యాధికారి నిమ్మల సాయిబాబును అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని లెప్రసీ, హెచ్ఐవీ, టీబీ వ్యాధిగ్రస్థుల వివరాలను, సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. మందుల వివరాలను వైద్యాధికారితో చర్చించారు. సిబ్బంది పని తీరుపై సమీక్షించారు.

పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

● పారిశ్రామికవేత్త గంగినేని రామయ్య ఔదార్యం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త గంగినేని రామయ్య

వినుకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్‌పీ కాలనీలోని జడ్పీ హై స్కూల్‌లో రూ.2లక్షల విలువైన ఆర్వో ప్లాంట్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త గంగినేని రామయ్య ఏర్పాటుచేశారు. శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి రామయ్య ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ వీరప్పయ్యతో పాటు ఉపాధ్యాయులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. మాజీ ఎమ్మెల్యే గంగినేని వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం విద్యార్థుల దప్పిక తీర్చేందుకు ప్లాంట్‌ను ఏర్పాటుచేసినట్లు రామయ్య తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఎన్.పద్మజ, ఎలీషా, ఎలిజబెత్ రాణి, గోవిందు నాయక్, రాంబాబు, చంద్రశేఖర్, శాంతి, రామాంజనేయులు, మల్లయ్య, గాయత్రి, కోటిరత్నం, సంధ్య, వార్డెన్ రేణుకమ్మ, సీఆర్పీ విశ్వనాథంలు పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయుడికి డాక్టరేట్



డాక్టరేట్ స్వీకరిస్తున్న ఏకేవీ ప్రకాష్

బొల్లాపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా సేవలు అందిస్తున్న ఏకేవీ ప్రకాష్ గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సెప్రడ్ గ్రియాలజికల్ సెమినార్‌లో ప్రకాష్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రకాష్ విద్యా రంగంలోనే, ఆధ్యాత్మిక సేవా రంగంలోను చేస్తున్న కృషిని గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసినట్టు సెమినార్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోలా ఓసన్న, ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రజిత్తు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఉపాధి పనులపై ఇంటింటి సర్వే

బొల్లాపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17వ విడత సోషల్ ఆడిట్ ఉపాధి పనులు ఇంటింటి కార్యక్రమంలో భాగంగా గుమ్మనంపాడులో 29 పనులకు రూ.1,73,68,038 పనులను సామాజిక తనిఖీ బృందం గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టింది. గ్రామంలో చేసిన పనుల వివరాలను పరిశీలిస్తూ ఉపాధి కూలీలకు అందించిన వేతనాల గురించి అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సర్వేలో సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు, వీఎస్ఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని వైసీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సైకో అన్న నందమూరి బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

జగన్మాత నమోస్తుతే...!



నరసరావుపేట శృంగేరి శంకర మఠంలో మోహిని అలంకారంలో శారదాదేవి అమ్మవారు



నరసరావుపేట వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ధనలక్ష్మీ అలంకారం



చిలకలూరిపేటలో రూ.21 లక్షలతో ధనలక్ష్మీ అలంకారంలో శ్రీశారదాంబ అమ్మవారు



నూజెండ్లలో మహాలక్ష్మీదేవిగా పూజలందుకుంటున్న అమ్మవారు

చిలకలూరిపేట: స్థానిక నన్నపనేని వెంకటరత్నం కళ్యాణమండపం ప్రాంగణంలోని శృంగేరి శ్రీ శారదాంబ దేవాలయంలో శుక్రవారం శారదాంబ అమ్మవారిని ధనలక్ష్మిగా రూ.21 లక్షల నోట్లతో అలంకరణ చేశారు. 24 మంది వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 325మంది సువాసినులతో కుంకుమార్చనలు చేశారు. ధనలక్ష్మి గ్రూపు సంస్థల నిర్వాహకులు పేర్ని వీరనారాయణ, నన్నపనేని రాఘవరావుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

● నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్లలోని అయ్యప్పస్వామి ఆలయంలో అమ్మవారు స్కందదేవిగా అలంకరించారు. పాలపాడు రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో అమ్మవారు వైష్ణవి దేవి అలంకరణలో, కోటప్పకొండలోని భువనేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డిపేటలోని బాలచౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవిదేవి అలంకరించారు. వల్లప్పచెరువు వద్ద ఉన్న గంగా మహాలక్ష్మీ అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

● శావల్యాపురం: విజయదశమిని పురస్కరించుకొని మతుకుమల్లి రామాలయంలో, శావల్యాపురంలోని నీలంపాటి అమ్మవారి దేవాలయం, గంటవారిపాలెంలోని లక్ష్మీతిరుపతమ్మ దేవాలయాల్లో ఐదో రోజైన గురువారం కనకదుర్గమ్మను శ్రీమహాలక్ష్మిగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట పట్టణం పాలపాడు రోడ్డులోని చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ధనలక్ష్మీ అలంకారం చేశారు.



నరసరావుపేట : లింగంగుంట్లలో స్కందదేవి అలంకరణలో అమ్మవారు



శావల్యాపురంలో శ్రీమహాలక్ష్మి అలంకరణలో కనకదుర్గమ్మ



నాదెండ్ల: గణపవరం కోదండ రామాలయంలో మహాలక్ష్మీ అలంకారం



బొల్లాపల్లి: మహాలక్ష్మిగా రేమిడిచర్లలో గౌరిశంకర్ దేవాలయంలో అమ్మవారు

● నాదెండ్ల: మండలంలోని గణపవరం శ్రీ కోదండ రామ స్వామి దేవాలయంలో మహాలక్ష్మి అవతారంతో ఉన్న అమ్మవారిని రెండు లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

● యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెంలోని శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారికి శుక్రవారం శ్రీధనలక్ష్మీ అలంకారం చేశారు. కరెన్సీ నోట్లను దండలుగా కూర్చి అలంకరించారు. బోయపాలెంలోని పార్వతీదేవి ఆలయంలోని అమ్మవారు శ్రీలలితాదేవి అలంకారంలోను, కొండవీడు శివాలయం, కొత్తపాలెం పార్వతీదేవి ఆలయంలోని అమ్మవార్లను శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించారు.

● వినుకొండ: పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్ వద్ద ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని చెరుకుగడలతో అలంకరించారు. కల్యాణ మండపంలో శ్రీలలితాదేవిగా అలంకరించారు. సుమారు ఐదు వందల మంది మహిళలతో కుంకుమార్చన నిర్వహించారు.

● రొంపిచర్ల: రొంపిచర్లలో వాసవి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం మహేశ్వరి అలంకారం నిర్వహించారు. ఆలయ ఆవరణలో జరిగిన రుద్రాభిషేక పూజల్లో, కుంకుమ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విప్పర్లలో కామాక్షి అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

● బొల్లాపల్లి: మండలంలోని శ్రీగంగా గౌరిశంకర్ దేవస్థానం రేమిడిచర్లలో కరెన్సీ నోట్లతో శ్రీ పార్వతిదేవి అమ్మవారికి మహాలక్ష్మి అలంకరణ చేశారు. వెల్లటూరు శ్రీ వేణుగోపాల స్వామి శివాలయంలో దొంతు ప్రదీప్‌కుమార్, కజ్జాయం అమరనాథ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

● నూజెండ్ల: మండలంలోని శ్రీవెంకటేశ్వర జగన్మాత పీఠం, వీ అప్పాపురం, నూజెండ్ల, ఐనవోలు పీఠంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు పూజలందుకుంటున్నారు.



రొంపిచర్ల: ధనలక్ష్మి అలంకారంలో విప్పర్లలోని కామాక్షి అమ్మవారు



వినుకొండలో చెరకు గడలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



వినుకొండలో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి లలితాదేవి అలంకరణ



యడ్లపాడు: శ్రీలలితాదేవి అలంకారంలో బోయపాలెంలోని పార్వతీదేవి...

జాతీయ స్థాయి పోటీలకు ఎన్ఈసీ విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు బీపీఆర్ అండ్ డీ హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను కళాశాల నిర్వాహకులు సిబ్బంది అభినందించారు.

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ భరద్వాజ

యడ్లపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ కోరారు. స్వస్థ్ నారీ సశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కారుచోలలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి హా జరైన 91మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పున్నారావు, ఆరోగ్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్



వినుకొండ లోతట్టు ప్రాంతాల్లోని కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న ఎక్సకవేటర్

వినుకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్ర బోస్ ఆధ్వర్యంలో శుక్రవారం కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగిన లోతట్టు, శివారు ప్రాంతాల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. పట్టణంలోని ముట్లకుంట కాలనీ, మార్కాపురం రోడ్, డబ్బా సెంటర్, జేసీబీల సాయంతో కచ్చా డ్రెయిన్‌ల ద్వారా నిల్వ ఉన్న నీటిని ఊరు బయటకు తరలించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, ఏఈ ఆదినారాయణ, సచివాలయ సెక్రటరీలు, మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

ఎంఏఎం కళాశాల చైర్మన్ శేషగిరిరావు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్క్రీన్ టైమ్ తగ్గించి స్కిల్‌ని పెంచుకోవాలని ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు అన్నారు. శుక్రవారం ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్ శేషగిరిరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ దరువూరి శ్రావ్య పృథ్వీరాజ్, కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ సాధినేని రామారావు, అధ్యాపకులు, విద్యార్థులుపాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు కళాశాలలో సందడి సృష్టించాయి.



ఫ్రెషర్స్‌డేలో పాల్గొన్న చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు తదితరులు

పింఛన్లు కొనసాగించాలని చర్మకారుల నిరసన



కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న పింఛనుదారులు

శావల్యాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చర్మకారులుగా గత కొన్నేళ్ళుగా సామాజిక పింఛన్లు పొందుతున్నామని, గ్రామానికి చెందిన కొందరు తమపై రాజకీయ కక్ష సాధింపులతో పింఛన్లు నిలిపివేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండలంలోని వయ్యకల్లు గ్రామానికి చెందినవారు ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. వయ్యకల్లుకు చెందిన దారా వీరాస్వామి, నాగరాజు, మోషే, ఎలియాల పింఛన్లకు ఆధారాలు సమర్పించాలని ఎంపీడీవో నుంచి ఈ నెలలో 3 సార్లు నోటీసులు రావడంతో ఆధారాలు ఇచ్చేందుకు కార్యాలయానికి వచ్చారు. ఎంపీడీవో అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి ఆధారాలను సమర్పించారు. వైసీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2 నెలలు పింఛన్లు నిలిపివేస్తే డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదుచేయడంతో ఈ నెలలో వారికి పింఛన్లు ఇచ్చారని, గ్రామ నాయకుల ఒత్తిడితో పింఛను తొలగిస్తామని మరలా నోటీసులు పంపుతున్నారన్నారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొర్రపాటి లక్ష్మీనారాయణ స్థానికంగా నివాసముంటున్నా గ్రామంలో లేడని ఏడు నెలల నుంచి అతని పింఛను తొలగించారన్నారు. ఇలా రాజకీయకక్షతో అన్యాయంగా అర్హుల పింఛన్లు తొలగిస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి పింఛన్లు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

మెగా డీఎస్సీతో యువతను ఆదుకున్న ప్రభుత్వం

● అన్నాచెల్లెళ్ళకు నియామక పత్రాలు అందజేసిన జీవీ



అభ్యర్థులకు పత్రాలను అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



జీవీ నుంచి నియామకపత్రాన్ని అందుకొంటున్న విజయచందర్

బొల్లాపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాటితండాకు చెందిన అన్నాచెల్లెలు ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో అన్నాచెల్లెలు ఎంపికయ్యారు. భూక్యా గోవిందునాయక్, సోనీ బాయి దంపతులకు ఐదుగురు సంతానం. వారిలో పెద కుమారుడు భూక్యా భాస్కర్‌నాయక్, రెండో కుమార్తె భూక్యా చికితబాయి డీఎస్సీలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులుగా అర్హత సాధించారు. ఈ సందర్భంగా గురువారం రాష్ట్ర సచివాలయం వద్ద ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వారిని అభినందించారు.

● పోట్లూరు (శావల్యాపురం) సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీతో కూటమి ప్రభుత్వం యువతను ఆదుకొందని, ఎన్నో పేద కుటుంబాల్లో వెలుగులు నింపిందని శావల్యాపురం మండలం పోట్లూరు ఎస్సీ కాలనీకి చెందిన నంబూరి విజయచందర్ అన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చేతులమీదుగా విజయ చందర్ గురువారం ఉపాధ్యాయ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా విజయచందర్ సీఎం చంద్రబాబు, విద్యాశాఖామంత్రి లోకేశ్ లకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మెగా డీఎస్సీతో 16,347మంది యువతీ, యువకులు కలలు సాకారమయ్యాయని విజయచందర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

స్వచ్ఛతా హీ సేవలో ఆటల పోటీలు



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్న సిబ్బంది

వినుకొండ టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ గుడిమెట్ల శారద సరోజిని అధ్యక్షతన మహిళలకు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. టీడీపీ నాయకులు శివనాగమల్లారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తడి పొడి హానికర చెత్త వేరు చేసే విధానం గురించి తెలియశారు. కార్యక్రమంలో అసిస్ట్ ఆర్గనైజర్ కొంద్రు ఏసోబు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు విద్యార్థులు, గ్రామ మహిళలు, పెద్దలు, పాల్గొన్నారు

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎంపీడీవో పీ మాధురి, పక్కన తహసీల్దార్ ఏ సుధాకర్

బొల్లాపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు బొల్లాపల్లిలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శుక్రవారం ఏర్పాటుచేశారు. శిబిరంలో తహసీల్దార్ ఏ సుధాకర్, ఎంపీడీవో మాధురి, ఆర్ఐ కే రామకోటయ్య, వివిధ అధికారులు 50మంది రక్తదానం చేశారు. ఈ సదర్భంగా రక్తదాతలను తహసీల్దార్ ఏ సుధాకర్ అభినందించారు.

సుపోషిత పంచాయతీగా బ్రాహ్మణపల్లి ఎంపిక



బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువును పరిశీలిస్తున్న కేంద్ర సెంట్రల్ టీమ్ సభ్యుడు

వినుకొండటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామాన్ని సుపోషిత గ్రామ పంచాయతీగా ఎంపిక చేసినట్లు సీడీపీవో కె.వాణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సాయంతో సెంట్రల్ టీమ్ సభ్యుడు సీహెచ్. రాజ్‌కుమార్ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, మెనూ పంపిణీ, మెనూను పరిశీలించారు. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పంపిణీ చేసిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఎత్తు, బరువును పరిశీలించారు. రాష్ట్రంలో 65 గ్రామాలను ఎంపిక చేశారని, పల్నాడు జిల్లాలో బ్రాహ్మణపల్లిని ఎంపిక చేసినట్లు కేంద్ర పరిశీలన సభ్యుడు తెలిపారు. సుపోషిత గ్రామంగా ఎంపిక అవ్వడంపై గ్రామపంచాయతీకి రూ.5లక్షలతో పాటు రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు చెరో రూ.50వేలు చొప్పున నిధులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాజకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.